అగ్గి రాజుకుంటే బుగ్గే!


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

- జిల్లాలో మండుతున్న ఎండలు
- ఈ ఏడాది ఇప్పటికే 117 అగ్నిప్రమాదాలు
- అప్రమత్తతే అసలు రక్షణ
- ఆపదలో టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలంటున్న అధికారులు

నిర్మల్‌టౌన్: వంటగదులు, పంటచేలు, షాపింగ్ మాల్స్, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, కార్యాలయాలు, పెట్రోల్ బంకులు.. ఎక్కడైనా సరే, వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండటం తప్పనిసరి. వేసవిలో అగ్ని ప్రమాదాలు సహజంగానే ఎక్కువగా జరుగుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో పంటలు పంట కోతలు ముగిసిన తర్వాత ఎండిన గడ్డి, పంట వ్యర్థాలను కాలుస్తుంటారు. ఈ సమయంలో జాగ్రత్తలు పాటించకుంటే గాలికి నిప్పురవ్వలు గడ్డివాములు, ఇళ్లపై పడి, మంటలు వ్యాపిస్తాయి. పట్టణాల్లో మాత్రం విద్యుత్ సంబంధిత సమస్యలతో అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు షాపింగ్ మాల్స్, ఆసుపత్రులు, ఇళ్లలో ఎయిర్ కండీషనర్ల(ఏసీల) వినియోగం పెరుగుతుంది. ఈ క్రమంలో విద్యుత్ ఉపకరణాల్లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగుతాయి. ఏ రూపంలోనైనా అగ్ని ప్రమాదాలు ఆస్తి, ప్రాణ నష్టాన్ని కూడా కలిగిస్తాయి.

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న వేళ..

జిల్లాలో రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా 41 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ వేడికి అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని అగ్నిమాపకశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

స్కూల్స్, మాల్స్, ఆసుపత్రుల్లో జాగ్రత్తలు

విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్, ఆసుపత్రుల్లో పైకప్పుగా ఆర్‌సీసీ లేదా కాంక్రీట్ స్లాబులను మాత్రమే వాడాలి. ఫైర్ అలారాలు, స్మోక్ డిటెక్టర్లను అవసరమైన చోట్ల ఏర్పాటు చేయాలి. సెల్లార్లలో ఆటోమేటిక్ స్ప్రింక్లర్లు అమర్చాలి. అగ్ని ప్రమాదాల సమయంలో సురక్షితంగా బయటపడేందుకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించి, అది అందరికీ తెలిసేలా ప్రదర్శించాలి. షాపింగ్ మాల్స్‌లో ఐఎస్‌ఐ మార్క్ ఉన్న విద్యుత్ సామగ్రిని మాత్రమే ఉపయోగించాలి. బయటకు వెళ్లే మార్గాల్లో ఎటువంటి అడ్డంకులు లేకుండా చూసుకోవాలి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కి సమాచారం ఇవ్వాలి.

వంటగదిలో జాగ్రత్తలు

వంటగదిలో గాలి, వెలుతురు సరిగ్గా ఉండేలా చూడాలి. చిన్న పిల్లలను అజాగ్రత్తగా వదిలిపెట్టకూడదు. చెడిపోయిన గ్యాస్ ట్యూబ్‌లను వాడకుండా, ఐఎస్‌ఐ మార్క్ ఉన్న కొత్త ట్యూబ్‌లను వాడాలి. ఎల్‌పీజీ వినియోగం తర్వాత రెగ్యులేటర్‌ను ఆపివేయాలి. గ్యాస్ లీక్ అనుమానం వస్తే, రెగ్యులేటర్ తీసివేసి, విద్యుత్ స్విచ్‌లను ఆన్-ఆఫ్ చేయకూడదు. మండుతున్న స్టవ్‌లో కిరోసిన్ పోయకూడదు. కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్లను వంటగదిలో ఉంచరాదు.

గ్రామీణ ప్రాంతాల్లో చర్యలు..

పూర్తిగా ఎండిన గడ్డిని మాత్రమే కాల్చాలి. గడ్డివాములు ఇళ్లకు కనీసం 60 అడుగుల దూరంలో ఉండాలి. చిన్న గడ్డివాములను నిర్మించి, వాటి మధ్య ఎక్కువ ఖాళీ ఉంచాలి. గుడిసెల మధ్య కనీసం 30 అడుగుల దూరం పాటించాలి. వేసవిలో బహిరంగ మంటలను వెలిగించకూడదు. వంట పొయ్యిలను రాత్రి పడుకునే ముందు ఆర్పివేయాలి.

సంప్రదించాల్సిన నంబర్లు

నిర్మల్	87126 99218
భైంసా	87126 99222
ఖానాపూర్	87126 99221

117 అగ్ని ప్రమాద కేసులు..

జిల్లాలో నిర్మల్, భైంసా, ఖానాపూర్‌లో ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం ఇస్తే అధికారులు అన్ని చర్యలు తీసుకుంటారు. జిల్లాలో గతేడాది మార్చి నుంచి ఇప్పటి వరకు 117 అగ్ని ప్రమాద కేసులు నమోదయ్యాయి. ఇందులో నిర్మల్ లో 51 అగ్ని ప్రమాదాలు, భైంసాలో 47, ఖానాపూర్లో 19 కేసులు నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో రూ.93,42,500 ఆస్తి నష్టం సంభవించింది. అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించి మంటలార్పడంతో దాదాపు రూ.4,12,095 విలువైన ఆస్తిని కాపాడారు.

వెంటనే సమాచారమివ్వాలి



జిల్లావ్యాప్తంగా అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే ఫైర్ 101, 100 టోల్‌ఫ్రీ నంబర్లు, ఇతర ఫైర్ స్టేషన్ల అధికారులకు సమాచారం అందించాలి. ఫైర్ స్టేషన్ అధికారులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. గతేడాది కంటే ఎండలు బాగా ఉన్నాయి. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలి. షాపింగ్ మాల్స్, ఆస్పత్రి, ఫ్యాక్టరీలలో జాగ్రత్తలు తీసుకోవాలి.

– దోలకలా ప్రభాకర్, జిల్లా అగ్నిమాపక అధికారి

క్లుప్తంగా

ముగిసిన వేలం

తానూరు: 2025–26 ఆర్థిక సంవత్సరంలో తానూరులో వారసంత నిర్వహణకు శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. వేలంలో ఇద్దరు పాల్గొనగా మహారాష్ట్రలోని ముథ్‌ఖేడ్ గ్రామానికి చెందిన మహ్మద్ రూ.2.26 లక్షలకు సంత నిర్వహణను దక్కించుకున్నట్లు కార్యదర్శి జలంసింగ్ తెలిపారు. ఎంపీడీవో నసీరొద్దీన్, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కుంటాలలో..

కుంటాల: ప్రతి ఆదివారం కుంటాలలో జరిగే వారసంత నిర్వహణకు శుక్రవారం కుంటాల గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. కుంటాలకు చెందిన కామాటి మట్ట గంగారాం రూ.21వేలకు సంత నిర్వహణను దక్కించుకున్నారు. కార్యదర్శి రాజబాపు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి


సరుకు అందిస్తున్న కార్యదర్శి రాజబాపు

కుంటాల: గ్రామాన్ని శుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పంచాయతీ కార్యదర్శి రాజబాపు పేర్కొన్నారు. శుక్రవారం కుంటాలలో పనిచేస్తున్న 12 మంది పంచాయతీ సిబ్బందికి సబ్బులు, నూనె, చేతిగ్లౌజులు, మాస్కులు అందజేశారు.

సామూహిక కుంకుమార్చన


పూజలు చేస్తున్న మహిళలు

ఖానాపూర్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు కీర్తి రాఘవశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, అంకురారోపణ, ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం, శాంతిహోమం, పూజలు చేశారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిర్మల్ ఎమ్మెల్యే విరాళం

నిర్మల్: నర్సాపూర్(జి)లోని పెద్ద హనుమాన్ ఆలయ ఆవరణలో హనుమాన్ ఉత్సవ విగ్రహం ఏర్పాటుకు వీలుగా షెడ్డు నిర్మాణం కోసం నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి రూ.50వేలను విరాళంగా అందించారు. ఈ నగదును శుక్రవారం బీజేపీ నాయకులు హనుమాన్ దీక్షాపరులకు అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు బర్కుంట నరేందర్, రాజేందర్, లక్ష్మణ్, గంగారాం, సుధాకర్ పాల్గొన్నారు.

మోటారు పంపు చోరీ

నిర్మల్: నర్సాపూర్(జి) మండలం చాక్‌పల్లి పంచాయతీ పరిధి దొంగుర్గాం గ్రామ సుద్ద వాగు పరివాహక ప్రాంతంలో సూర్యకాంతరావు విద్యుత్ మోటారు పంపును గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సాయికిరణ్ శుక్రవారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. విచారణ జరిపి దొంగలను పట్టుకుంటామని పేర్కొన్నారు.

యాప్ వినియోగంపై అవగాహన

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్ మున్నూరుకాపు సంఘ భవనంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి సీడీపీఓ రాజశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. లబ్ధిదారులకు అందిస్తున్న పోషకాహారం, ఇతర వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన అవధూత్ నరేష్ ఆవు విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకొంది. ఆవు మేత మేస్తూ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటు చేసిన ఎర్తింగ్ వైర్లకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.60వేల వరకు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు. పశువైద్యాధికారి నందకుమార్ వచ్చి పంచనామా నిర్వహించారు.

సమష్టి కృషితో మొదటిస్థానం


ఎంపీవోను సన్మానిస్తున్న ఎంపీడీవో రాధ

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద మండలం ఇంటి పన్నులను 99 శాతం వసూలు చేసి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు ఎంపీడీవో రాధ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో అమీర్‌ఖాన్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులను శాలువాతో సన్మానించారు. సమష్టి కృషితోనే ముందున్నట్లు ఆమె పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

దస్తురాబాద్: అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొడిసీర్యాల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రాజ్యాంగంతో బహుజన బతుకుల్లో వెలుగులు నింపిన మహనీయుడు అంబేడ్కర్ అని.. బీజేపీ పాలనలో ప్రమాదంలో ఉన్న రాజ్యాంగాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, మాజీ ఎంపీపీ సింగరి కిషన్, నాయకులు రమేశ్‌రావు, రాజేశం, మహేందర్‌రెడ్డి, రంజిత్, కొమురవెల్లి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో మంకీ క్యాచర్స్


పట్టుకున్న కోతుల వద్ద మున్సిపల్ కమిషనర్

ఖానాపూర్: కోతుల బెడద నిర్మూలనకు ఉన్నతాధికారులు, పాలకుల ఆదేశాల మేరకు మంకీ క్యాచర్స్, అటవీ అధికారుల ఆధ్వర్యంలో పట్టణంలోని పలు కాలనీల్లో కోతులను పట్టుకున్నామని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. మగ కోతులకు స్టెరిలైజేషన్ చేయించి ఆడ కోతులను దూర ప్రాంతాల్లో వదిలిపెట్టనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో కొద్ది రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు.

వాహన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలి

- ఏఎస్పీ రాజేశ్‌మీనా
- కాల్వతండాలో కార్డన్ సెర్చ్


మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

దిలావర్‌పూర్: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని.. వాహనదారులు ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా అన్నారు. శుక్రవారం మండలంలోని కాల్వతండా గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఏఎస్పీ, పలువురు సీఐలు, ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు గ్రామానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా 88 బైక్‌లు, త్రీ, ఫోర్ వీలర్స్ వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పౌరులు ప్రాథమిక చట్టాలు, రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాలతో కలిగే నష్టాలను వివరించారు. అపరిచితులకు ఏటీఎం కార్డులు ఇవ్వడం, ఓటీపీలు చెప్పడం వంటివి చేయొద్దని పేర్కొన్నారు. ఇందులో నిర్మల్‌రూరల్ సీఐ కృష్ణ, దిలావర్‌పూర్ ఎస్సై సందీప్, పలువురు ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్


రైతులతో మాట్లాడుతున్న అధికారి శ్రీనివాస్

లోకేశ్వరం: వరి సాగు చేసిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించి మద్దతు ధర పొందాలని ఇన్‌చార్జి డీఆర్డీవో, డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే స్థలం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ కాంట, గన్నీ బ్యాగులు, ప్రథమ చికిత్సకిట్, టార్పాలిన్, చలువ పందిళ్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని.. సిబ్బందికి సూచించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఎం రాజేశ్వర్, ఎత్తిపోతల పథకం చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఏపీఎం మల్లేశ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు నీరడి సాగర, సీసీలు రాజేశ్వర్, సుకుమార్ ఉన్నారు.

'రైతు వ్యతిరేక విధానాలు ఎండగట్టాలి'


మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, రైతు సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి యం.మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టణంలోనీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల జిల్లా కార్యశాలను నిర్వహించారు. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6న ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని బూత్‌లలో బీజేపీ జెండాలు ఎగురవేత, 8, 9 తేదీల్లో క్రియాశీల కార్యకర్తల సమ్మేళనాలు, 10, 11, 12 తేదీల్లో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వివరించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా నివాళులర్పించాలని సూచించారు. వక్ఫ్ బోర్డు బిల్లు సవరణ, జన జాగరణ, వన్ నేషన్.. వన్ ఎలెక్షన్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా నేతలు రావుల రామ్నాథ్, సత్యనారాయణగౌడ్, ఆకుల శ్రీనివాస్, ఒడ్నాల రమేశ్, ఒడిసెల అర్జున్, ఆకుల కార్తీక్, కార్యక్రమ ఇన్‌చార్జీలు అమరవేణి రవీందర్‌గౌడ్, అర్జున్‌సింగ్ ఠాకూర్, సుమన్, అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు పాల్గొన్నారు.

భూవివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: అటవీ, రెవెన్యూ శాఖల భూసమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ, రెవెన్యూ భూ వివాదాల పరిష్కారంపై అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రతీ ఎకరా భూమి విలువైనదని, అటవీ, రెవెన్యూ భూముల హద్దులను తక్షణమే గుర్తించి, రెగ్యులర్ సర్వేలు నిర్వహించాలన్నారు. ఆక్రమించిన ప్రాంతాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా సర్వే అధికారులు మ్యాప్‌లను తయారు చేయాలన్నారు. అటవీ, రెవెన్యూ శాఖలలో ప్రజల భూ సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులతో ముడిపడి ఉన్న సమస్యలకు సంబంధించి కోర్టుల ఆదేశాల ప్రకారం పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి నాగినిభాను, ఆర్డీవో రత్నకళ్యాణి, ఆర్‌అండ్‌బీ ఈఈ అశోక్‌కుమార్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న కార్యదర్శి సయ్యద్ మహమూద్

సోన్: ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశం వద్ద కనీస సౌకర్యాలు కరువయ్యాయని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ మహమూద్ అన్నారు. శుక్రవారం సోన్‌లో పని ప్రదేశం సందర్శించి మాట్లాడారు. తాగునీరు, టెంట్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సౌకర్యాలు కల్పించకుంటే కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగుతామని హెచ్చరించారు. ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా డబ్బులు జమ కావడం లేదని.. సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు కృషి

భైంసాటౌన్: అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధుల మంజూరుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి. నారాయణ్‌రావు పటేల్ అన్నారు. బాసర మండలం లాబ్ది గ్రామస్తులు శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ఆయనను కలిశారు. తమ గ్రామంలో సీసీ డ్రెయినేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలుపగా.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లక్ష్మణ్ షిండే, తానాజీ, శంకర్ షిందే, ప్రసాద్, గౌతం, నర్సింగ్, రాహుల్ ఉన్నారు.

సన్నబియ్యం పంపిణీ

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని రేషన్ దుకాణాల్లో శుక్రవారం సన్న బియ్యం పంపిణీని తహసీల్దార్ జానకి ప్రారంభించారు. నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, భూమన్న పాల్గొన్నారు.

కడెం: మండలంలోని ఎలగడప, దిల్దార్‌నగర్ గ్రామాల్లో శుక్రవారం సన్నబియ్యం పంపిణీని ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ భూషణ్ ప్రారంభించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, శంకర్, శ్రీనివాస్‌యాదవ్, భూమేశ్, రమేశ్, సలీం, భూమరాజం, రహీం ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

జైబాపు.. జైభీమ్.. జై సంవిధాన్

సోన్: మండలంలోని న్యూవెల్మల్, సంగంపేట గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి, బొడ్డు లక్ష్మణ్, మొహీనుద్దీన్, రాజనర్సింహారెడ్డి, మేక ప్రేమ్‌కుమార్, సీహెచ్.గంగాధర్, నరసయ్య, లింగన్న, మోహన్ పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని ఆష్టా, బ్రహ్మణ్‌గావ్, వికోలి గ్రామాల్లో జైబాపు.. జైభీమ్.. జై సంవిధాన్ నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రావుల గంగారెడ్డి, ప్రసాద్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, రోజారెడ్డి, నర్సారెడ్డి, రమేశ్, పోతారెడ్డి తదితరులున్నారు.

హార్వెస్టర్ల డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

లక్ష్మణచాంద: వరి పొలం కోసేటప్పుడు బ్లోవర్ వినియోగిస్తే ధాన్యంలో తప్ప, తాలు రాకుండా ఉంటాయని తహసీల్దార్ జానకి పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని హార్వెస్టర్ల యజమానులు, వ్యవసాయాధికారులతో మాట్లాడారు. ఏవో వసంత్‌రావు, ఆర్‌ఐ నరేందర్ రెడ్డి, ఏఈవోలు పవిత్ర, మౌనిక పాల్గొన్నారు.

ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలి

లోకేశ్వరం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నగర్, బాగాపూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో పరిశీలించి మాట్లాడారు. గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

పెరిగిన చార్జీలు చెల్లించాలి

కడెం: మధ్యాహ్న భోజన కార్మికులకు పెరిగిన మెనూ చార్జీలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడెంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులకు స్నాక్స్ బిల్లులు, కార్మికులకు రూ.పది వేల వేతనం చెల్లించాలని కోరారు. రాధ, సునీత, అశ్విని తదితరులున్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి

ఖానాపూర్: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని టీఎన్జీవో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని సీఎంరావు గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ధర్మపురి మార్కెట్ కమిటీ సెక్రటరీ భూమన్న ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఖానాపూర్ మండలం మస్కాపూర్‌కు చెందిన భూమన్న విధుల్లో అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. టీఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, మస్కాపూర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల కృష్ణ, మాజిద్, నాయకులు రాములు, విఠల్, రవీందర్, అడెల్లు, అజాం అలీ, నరహరి, దయానంద్ ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్ గ్రామపంచాయతీలోని చెన్నూర్‌కు చెందిన శంకర్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్ శుక్రవారం గ్రామానికి వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.ఐదు వేలను ఆర్థికసాయంగా అందించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, రమేశ్‌రావు, రాజేశం, రంజిత్ తదితరులు ఉన్నారు.

శోభాయాత్ర విజయవంతం చేయాలి


నిర్మల్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు


భైంసాలో మాట్లాడుతున్న మహిష నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని హిందూవాహిని, బజరంగ్‌దళ్ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 6న ఉదయం 10 గంటలకు దేవరకోట దేవస్థానం నుంచి నిర్వహించే శ్రీరామ, వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందూవాహిని నిర్మల్ జిల్లా సహసంయోజక్ కందుల హరీష్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఐబీలో విజయాత్ర పోస్టర్లు విడుదల చేశారు. హిందూ వాహిని పట్టణ అధ్యక్షుడు మంద పవన్, సహ సంయోజక్ ముకేష్, మనోజ్ వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు జాదవ్ విఠల్, భజరంగ్ దళ్ పట్టణ అధ్యక్షుడు కూన సతీష్, సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: ఈనెల 6న పట్టణంలోని గోశాల నుంచి ఏపీనగర్‌లోని రాంలీలా మైదానం వరకు రాముడి విగ్రహంతో నిర్వహించే శోభాయాత్రకు హిందువులు తరలిరావాలని హిందూవాహిని మహిషా శాఖ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని నర్సింహ కల్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడారు. శోభాయాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై అసహనం వ్యక్తం చేశారు. అనుమతి కోసం హైకోర్టును ఆశ్రయించామని.. ఉన్నతాధికారులు శోభాయాత్రకు సహకరించాలని కోరారు. హిందూ వాహిని పట్టణ అధ్యక్షుడు ఆకుల రంజిత్, తెలంగాణ ప్రాంత ప్రముఖ్ మహేశ్, సభ్యుడు పృథ్వీరాజ్ ఉన్నారు.

ముధోల్: ఆదివారం ముధోల్‌లో నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందువాహిని ముక్తాపూర్ శాఖ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మరమ్మతులు చేపట్టాలి

భైంసాటౌన్: పట్టణంలో శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహించే మార్గంలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని హిందూ వాహిని, బీజేపీ నాయకులు కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.రాజేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గుంతలు పూడ్చి.. మరమ్మతులు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు.

ఉపాధి పనులు ఎండలో చేయొద్దు

తానూరు: రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున కూలీలు సకాలంలో పనులు పూర్తి చేసుకొని ఇళ్లకు వెళ్లాలని ఈజీఎస్ ఏపీవో శివలింగం సూచించారు. శుక్రవారం మండలంలోని హిప్నెల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ప్రారంభించి కూలీలతో మాట్లాడారు. కూలి రేట్లు పెరిగాయని.. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. మరసటి రోజు కూలీలు చేసిన పనుల కొలతలను నమోదు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట టీఏ గంగాధర్, ఎఫ్ఏ సంజీవ్, కూలీలు తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో రాధ పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఇందులో ఎఫ్ఏ నరేశ్ తదితరులు ఉన్నారు.